# (ఎ) జెండాపై కపిరాజు

అరగంట నుంచీ నుంచున్నాను. యూనివర్శిటీ వైపు వెళ్ళే బస్సు ఒకటీ రాలేదు. అంటే ఒకటో నెంబరు కాదు. 1, 2, 3, 10, 14, 16, 17, 19, 21, 26 ఈ నెంబర్లలో ఏదీ రాలేదు.

ఇంచుమించు నాతో సమానంగా నుంచున్న ఒకాయన్ని అడిగాను- "మీరెంత సేపట్నించి నించున్నారు? మీరూ యూనివర్శిటీ వేపేనా?" అని.

"నేనూ మీరూ ఒకేసారి వచ్చేం యిక్కడికి. మనం రావడానికి ఒక్క నిమిషం ముందుగా ఆరు బస్సులు జట్టుగా యూనివర్శిటీవైపు వెళ్ళాయి!" అన్నాడు.

"అవును! ఆయనెవరో పేపర్లో ప్రకటన చేశారు. బస్సులు ఒస్తే గుంపులు గుంపులుగా రావడం, లేకపోతే అసలు రాకపోడం సంభవించవచ్చు. తస్మాత్ జాగ్రత్త అంటూనూ" అని చెప్పాను.

క్రీచ్ మంటూ కారొకటి ఆగింది; మేం నుంచున్న చోటికి తొంభై గజాల్లో. 'ఏదో యాక్సిడెంటు' అనుకొని అటు చూశాను; కొంచెం అటు కదిలాను కూడా.

కమలనాభరావు కారు తలుపు తెరిచి, తల బైటికిపెట్టి "రా" అన్నట్టు చెయ్యి వూపాడు.

పరుగెత్తి వెళ్ళి ఎక్కాను.

చెప్పాడు. విశాఖపట్నంలోనే, చాలా పెద్ద ఉద్యోగంలో వున్నాడట. ఇటీవలె ట్రాన్స్ఫరయి వచ్చాడట. 'సిటీ బస్సులు, అవి పని చేయుచున్న విధానము' అన్న విషయంపై ఒక మీటింగ్‌లో పాల్గొనడానికి యూనివర్శిటీ వైపు వెళుతున్నాడట.

"నువ్వు కూడా రాకూడదూ, మరేమీ అనుకోకపోతే ?" అన్నాడు. నిజానికి నాకేమీ కొంపమునిగిపోయేటంత పనిలేదు. వెళ్ళినా వెళ్ళొచ్చు.

"ఎవరెవరుంటారు, ఆ మీటింగ్‌లో ?" అన్నాను.

ఆర్. టి. సి. ఏరియా మేనేజరు, పోలీసు సూపరింటెండెంటు, ఆర్. టి. ఓ. ఫలానా కంపెనీ జనరల్ మేనేజరు. ఇలా చాలామంది అధికారులు, అనధికారుల లిస్టు చెప్పాడు. ఊళ్ళో అతి ముఖ్యమైన పెద్దలు అందరూ వున్నారు. అంతమంది మహానుభావుల్ని ఒక్కచోట చూడడమే ఒక గొప్ప అనుభవం కదా.

"నాకు రమ్మని పిలుపు లేదు. నే వస్తే బావుంటుందా ?" అని జంకాను.

"నే చెప్తాగా" అన్నాడు. ఇంచుమించు ఆ మాట అనే వేళకి మీటింగ్ జరిగేచోట కారు ఆగింది.

లోపలికెళ్ళాం- అందరూ అంతకుముందే వచ్చేశారు. వాళ్ళంతా కమలనాభరావు కోసం ఆగారు. అతనూ నేనూ లోపలి కెళ్ళగానే మీటింగు మొదలైంది. మిగిలిన అధికారులందరూ స్టెనోగ్రాఫర్లతో, పి. ఎ. లతో వచ్చారు. నన్ను తన స్టెనోగా పరిచయం చేసి లోపలికి లాగాడు కమలనాభరావు.

బస్సుల నడవడి అంటే ప్రవర్తన నడక- మొదలైనవి యాక్సిడెంట్లు చేయకుండా నడవడం, మొదలైనవి గురించి అందరూ వాళ్ళ ఆఫీసుల్లో రాసుకొచ్చిన నివేదికలు చదివారు. 'అంతయు సరిగా నున్నది. ఒకవేళ కొన్ని విషయాలు సరిగా లేకపోయిన సిటీ రూట్లలో ఆర్. టి. సి. బస్సులు కొత్తగా వేశారు. కనక ఆయా లోటుపాట్లు బాలారిష్ట దోషాలుగా పరిగణించి వదిలెయ్యవచ్చు' అని తీర్మానాలు చేసి సంతకాలు పెట్టేశారు. కాఫీ టిఫిన్లు వచ్చాయి. వాటిమీద పడ్డారు అందరూ.

"కమలం, నేను ఒకటి రెండు పాయింట్లు చెప్పవచ్చునా ?" అన్నాను.

కాగితాలన్నీ అందరూ పాడ్స్‌లో కట్టి దాచేసుకొన్నారని గమనించి "ఓ ఎస్ ! చెప్పు !" అన్నాడు.

"మీరందరూ పెద్ద పెద్ద వుద్యోగస్తులే. ఈ ఊరి భవిష్యత్తును తీర్చి దిద్దవలసిన వాళ్ళే కాని, సిటీబస్సులు ఎలా నడవాలి ? వాటి విషయంలో ఎలాంటి ఉపయోగకరమైన మార్పులు చెయ్యాలి అన్న విషయం చర్చించడానికి మీలో ఏ ఒక్కరికీ అర్హత లేదేమోనని నా అనుమానం. ఎందుకంటే, మీలో ఎవ్వరూ సిటీబస్సు ఎక్కరు; కనీసం ఈ ఊళ్ళో'' అన్నాను.

'నిజమే సుమీ' అన్నాడు కమలం.

''ప్రయివేటు బస్సు ఓనర్లు లాభాలకోసం ఏర్పాటు చేసుకున్న రూట్లే రోడ్డు రవాణా సంస్థవారు కూడా మక్కీకి మక్కీగా ఫాలో అవక్కర్లేదు. మంచి మంచి రోడ్లు అనేకం, బస్సులు తిరక్కుండా వుండిపోయాయి. మాట వరసకి 75 అడుగుల రోడ్డు, ఆశీలుమెట్ట- యూనివర్శిటీ రోడ్డు, సన్ అండ్ సీ నుంచి వెంకటేశ్వర గుడికి బీచ్

మీదుగా వున్న రోడ్డు, దండుబజారు, మెయిన్‌రోడ్డు- ఇలాంటివి ఉప యోగించాలి" అన్నాను.

"పాయింటే సీమ్‌-" అన్నాడు కమలం పక్కనే నుంచుని టిఫిన్ తింటున్న మనోహర్రావుగారు.

"మరొకటి- 1, 2, 3, 16, 21 అన్నీ ఒకచోటనుంచి బయల్దేరి ఒకేచోటుకి, ఒకే రూటుద్వారా వెళతాయి. అన్ని నెంబర్లు ఎందుకు? వాటిలో ఒకటో, రెండో ప్రస్తుతం వున్న రూట్‌లో తిరిగి, మిగిలినవి బజారుకి రాకుండా సరాసరి టెర్మినస్‌కి వెళ్ళిపోవచ్చు.''

"అవును. అదీ నిజమే" అన్నాడు కమలం ఈసారి.

"అలాగే 11, 18, 20 కూడా."

"రింగురూట్లు, పొట్టిరూట్లు, సింగిల్‌ఫేర్ రూట్లు ఏర్పాటు చెయ్యడానికి చాలా సావకాశా లున్నాయి ఇక్కడ. మరి అవి ఎలా చెయ్యాలి అంటే రూట్ మ్యాపు ముందు తయారుచెయ్యాలి!"

"ఎస్, ఎస్."

''కొత్తగా ప్రవేశపెడుతున్న రెండుద్వారాల బస్సుల్లో హైదరా బాదులో లాగా, ముందువేపున స్త్రీలకు ప్రత్యేకం. కొంతచోటు వదిలేసి రెయిలింగ్స్ నిర్మించాలి. ఇకమీదట సరఫరా అయ్యే బస్సుల్లో అవి ఫ్యాక్టరీలోనే తయారయ్యేటట్టుగా ఆర్డర్ చెయ్యాలి."

ఎవరో ఒకాయన, నాకు షేక్హాండిచ్చారు- "మీ సలహాలన్నీ బాగున్నాయి. కాని వాటిని ఎజండాలో చేర్చందే వాటి గురించి చర్చించడం జరగదు. ఆలోచించడం అంతకన్నా జరగదు" అన్నారు.

అదీ పాయింటే మరి!

(31-3-79)